ఇంటింటి సర్వేకు పక్కా ప్రణాళిక

- 63,304 కుటుంబాల సర్వేకు 3,719 మంది ఎన్యూమరేటర్లు
- నియోజకవర్గాల పరిశీలకులుగా జిల్లా అధికారులు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, నవంబర్ 4: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పక్కా ప్రణాళికతో చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి కుటుంబ సర్వేపై కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 63,304 కుంటుంబాలు ఉన్నాయని, ప్రతి ఇంటి సర్వే కోసం పక్కాగా ప్రణాళిక చేశామని తెలిపారు. వాటిని 3,654 ఈబీలుగా విభజించి 3,719 మంది ఎన్యూమరేటర్లను, 314 మంది సూపర్‌వైజర్లను, ఐదుగురు నియోజకవర్గస్థాయి అధికారులను నియమించామని వివరించారు. ఖమ్మం నియోజకవర్గాన్ని జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, పాలేరును అదనపు డీఆర్‌డీవో నూరూద్దీన్, వైరాను డీఎల్‌పీవో రాంబాబు, సత్తుపల్లిని కల్లూరు ఆర్డీవో రాజేందర్, మధిరను ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు పర్యవేక్షిస్తారని తెలిపారు. సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు ఉన్నాయని, రోజుకు ఒక సర్వేయర్ 10 ఇళ్లను సర్వే చేస్తారని వివరించారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఇళ్ల లిస్టింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఒక్కో సర్వేయర్ 150 ఇళ్లను సర్వే చేయాలని చేయాలని, 15 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. వీరిని మండల స్టాటిస్టిక్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సర్వేలో పొరపాట్లకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్‌వో రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సర్వే'పై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 4: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో అధికారులు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బీ.నాగమణి, డీఈవో సోమశేఖరశర్మ ప్రారంభించారు. సీఎంవో రాజశేఖర్, ఎంపీడీవో అశోక్‌కుమార్, జీవన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్పొరేషన్ ఆర్ఐలు జ్యోతి, రామారావు, ఎంఈవో శైలజాలక్ష్మి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే

పెనుబల్లి, నవంబర్ 4 : కల్లూరు మండలం చండ్రుపట్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి సర్వే, ఇండ్ల జాబితా ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం పరిశీలించారు.

తక్కెళ్లపాడులో ఇంటింటి సర్వే

ఎర్రుపాలెం, నవంబర్ 4 : మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిమిత్తం కుటుంబాలు ఎన్ని ఉన్నాయో జాబితా తయారీ నిమిత్తం గ్రామంలో స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు

స్థలం ఉన్నవారికే ముందుగా ఇండ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, నవంబర్ 4 : రాష్ట్రంలో గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తామని, అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం తిరుమలాయపాలెం మండల సమీక్షా సమావేశంలో అధికారులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని, పేదవాడికి సంక్షేమ పథకాలు అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఇంటిస్థలం ఉన్నవారికే ముందుగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పట్ల పూర్తి అవగాహనతో పని చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు శివరామకృష్ణ, శ్రీను, నరేశ్‌రెడ్డి, మంగీలాల్, అశోక్, గోపాల్‌రావు, వంశీ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

దానవాయిగూడెంలో మంత్రి పర్యటన

ఖమ్మం రూరల్, నవంబర్ 4 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించి ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరిట మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వసాయం నాలుగుదశల్లో పునాది వేసినప్పుడు రూ.లక్ష, లెంటల్ లెవల్‌లో రూ.1.25 లక్షలు, స్లాబ్ దగ్గర రూ.1.75 లక్షలు, గృహప్రవేశం సమయానికి మరో రూ.లక్ష లబ్ధిదారులకు నేరుగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవిదేవి, ఏఈ కుమారస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

కేఎంసీ గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ

ఖమ్మం, నవంబర్ 4: ప్రజావాణిలో అర్జీదారులు అందించిన అర్జీలకు సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్, కేఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీజ సూచించారు. ఖమ్మంలోని కే ఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఎక్కువగా మున్నేరు వరద బాధితులు వస్తున్నందున వారి పరిహార స్థితి ఏమిటో పరిశీలించాలని, ఆ వివరాలను వారికి తెలియజేయాలని సూచించారు. అలాగే, కేఎంసీ గ్రీవెన్స్‌కు ఇక్కడి అన్ని శాఖల అధికారులు హాజరువాలని సూచించారు. అనంతరం ఏయే శాఖల నుంచి అధికారులు వచ్చారో, ఏయే శాఖల నుంచి అధికారులు రాలేదో అనే అంశాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.

ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్, రగ్బీ జట్ల ఎంపికలు

ఖమ్మం సిటీ, నవంబర్ 4:ఉమ్మడి జిల్లా పాఠశాలల అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్, రగ్బీ ఎంపికల పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగాయి. ఆయా ఎంపికల్లో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి అథ్లెటిక్స్‌కు 220 మంది, రగ్బీకి 140 మంది హాజరయ్యారు. చక్కని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేశారు. రగ్బీ క్రీడాకారులను మేడ్చల్‌లో జరిగే అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు, అథ్లెటిక్స్ జట్టును ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఖమ్మంలో జరుగనున్న అండర్- 14 పోటీలకు పంపిస్తామని డీఈవో సోమశేఖరశర్మ, పాఠశాలల క్రీడా కార్యదర్శి కే.నరసింహమూర్తి తెలిపారు. ఎంపిక పోటీలను కోచ్‌లు సఫీక్ అహ్మద్, కృష్ణ, రఘు, పీడీలు సైదేశ్వరరావు, రవికుమార్, ముజాహిద్, నవీద్ పాషా, శివ, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఉషు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట

ఖమ్మం సిటీ, నవంబర్ 4: మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాలబాలికల ఉషు పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎనిమిది పతకాలు సాధించారు. వారిని ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరి సునీల్‌రెడ్డి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయస్థాయిలో రాణించి ఖమ్మానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉషు కోచ్ పీ.పరిపూర్ణాచారి, అండర్-17, 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి మూసా, టేబుల్ టెన్నీస్ కోచ్ సాంబమూర్తి పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్దలకు అభినందన

సత్తుపల్లి, నవంబర్ 4 : సత్తుపల్లి జామియా మసీదు నూతన సదరు, కమిటీ సభ్యులుగా ఎన్నికైన షేక్ నయాబ్‌రసూల్, కమల్‌పాషా సోమవారం దమ్మపేట మండలం గండుగలపల్లిలోని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీసభ్యులుగా ఎన్నికైన సభ్యులను మంత్రి సన్మానించి అభినందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
CHANGE OF NAME
★ I BHUKYA GOBRIA CHANGED MY NAME AS BHUKYA GOBRIYA, S/O. BHUKYA BHEEKYA, R/o. H.No. 1-124, GOLLAPALLI, BOMMANAPALLI TEKULAPALLI, BK DIST-507123 T.G.
KMM-
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచింపడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మోడల్ విద్యార్థులకు బంగారు పతకాలు

కారేపల్లి, నవంబర్ 4 : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాల, పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ ఇలియాట్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో అవార్డులు అందుకున్న విద్యార్థులను అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఊషు పోటీల్లో బి.ప్రేమ్‌కుమార్, రాకేష్ గోల్డ్‌మెడల్, సాయి త్రిష, నైనీ, అభిలాష్, వంశీ సిల్వర్ బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఇంటర్ విద్యార్థి స్పందన ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు.

'పెండింగ్ బిల్లుల'పై పోరుబాట

- 'చలో హైదరాబాద్' వెళ్తున్న మాజీ సర్పంచ్‌ల అడ్డగింత
- ఎక్కడికక్కడ ఠాణాలకు తరలించిన ఖమ్మం పోలీసులు

రఘునాథపాలెం, నవంబర్ 4: పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన 'చలో హైదరాబద్ పోరుబాట' కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా రఘునాథపాలెం పోలీసులు అడ్డుకున్నారు. మాజీ సర్పంచ్‌లు సోమవారం ఉదయమే హైదరాబాద్‌కు బయలుదేరిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు.. మార్గంమధ్యలోనే వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. తాము సర్పంచ్‌లుగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పనుల కోసం సొంతంగా నిధులు ఖర్చు చేశామని, ఆ బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూస్తున్నామని, అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మాదంశెట్టి హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాజీ సర్పంచ్‌లం అందరమూ కలిసి రాష్ట్ర రాజధానిలో శాంతియుతంగా నిరసన తెలియజేందుకు హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పారు. అయితే, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. మాజీ ప్రజాప్రతినిధులను ఇలా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో మరో మాజీ సర్పంచ్ కొర్లపాటి రామారావు తదితరులు ఉన్నారు.

మహిళా శక్తి టీ స్టాల్‌ను పరిశీలించిన కలెక్టర్

మామిళ్లగూడెం, నవంబర్ 4: కలెక్టరేట్ ఎదుట నూతనంగా ఏ ర్పాటుచేసిన మ హిళా శక్తి టీ స్టాల్ ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం పరిశీలించారు. ఉదయం టీ స్టాల్‌ను సందర్శించిన ఆయన.. రోజు వారీ వ్యాపార వివరాల గురించి నిర్వాహకురాలని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే టీ తాగారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని, ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు.

'ధాన్యం కమీషన్ గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలి'

మామిళ్లగూడెం, నవంబర్ 4: కల్లూరు సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కమీషన్ గోల్‌మాల్ అయిన అంశంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ మేరకు ఖమ్మం ఐడీవోసీలో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించా రు. కల్లూరు ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా వచ్చిన కమీషన్‌ను కొందరు అక్రమార్కులు దారిమళ్లించారని ఆరోపించారు. ఈ విషయంపై డీసీవోకు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవాలని తెలిపారు.

'బీబీసీ'కి డ్రాప్‌లు నిర్మించాలని రైతుల నిరసన

- ప్రజావాణి, ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతులు, నాయకులు

బోనకల్లు రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీలు, రైతులు

బోనకల్లు, నవంబర్ 4 : రైల్వే మూడో లైన్ పనుల కోసం ఇష్టారాజ్యంగా కూల్చివేసిన బోనకల్లు బ్రాంచ్ కెనాల్(బీబీసీ) డ్రాప్‌లను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా బోనకల్లు ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట, రైతు వేదికలోని ప్రజావాణి కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, రైతు సంఘం నాయకులు, రైతులు సోమవారం వేర్వేరుగా బైఠాయించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జానీమియా, సీపీఎం నాయకుడు దూబా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నాయకుడు దొప్పా ప్రసాద్ మాట్లాడారు. ముష్టికుంట్ల సమీపంలోని బీబీసీపై ఉన్న డ్రాప్‌లను రైల్వే మూడోలైన్ పనుల కోసం రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు.. రైతులను, నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించకుండా కూలగొట్టారని ఆరోపించారు. దీంతో నీటి సరఫరా లేకపోవడంతో ముష్టికుంట్ల, నాగులవంచ, రామాపురం గ్రామాల్లోని సుమారు 800 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని గురించి నీటిపారుదల శాఖ అధికారులుకు చెప్పినా సమస్య ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. సమస్యను పరిష్కరించేంత వరకు ప్రజావాణి కార్యక్రమం నుంచి వెళ్లేది లేదని బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు, పార్టీల నాయకులు చంద్‌పాషా, బంధం వెంకన్న, ముస్తఫా, దారగాని రామారావు, పర్సగాని గోవర్ధన్, జానపాటి నాగేశ్వరరావు, గోదా ఆదినారాయణ, వేణు, బాధా కృష్ణ, ఉమామహేశ్వరరావు, అబ్దుల్లా పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

వేంసూరు, నవంబర్ 4 : గత ఫిబ్రవరిలో జరిగిన డీఎస్సీ-2024లో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన కందుకూరు కాంప్లెక్స్‌కు చెందిన ఉపాధ్యాయులను సోమవారం కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, బండి వెంకటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ధాన్యం కొనుగోలు, సీసీఐ కేంద్రాల ప్రారంభంలో ఎమ్మెల్యేలు

సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

కారేపల్లి/ పెనుబల్లి/ వేంసూరు/ మధిర రూరల్, నవంబర్ 4: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైరా, ఇల్లెందు, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, మట్టా రాగమయి పేర్కొన్నారు. కారేపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో ఏర్పాటుచేసిన సీసీఐ కేంద్రాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటలను విక్రయించి మద్దతు ధరలు పొందాలని సూచించారు. కారేపల్లి మండలం అప్పాయిగూడెం జిన్నింగ్‌మిల్లు ప్రాంగణంలో సీసీఐ కేంద్రాన్ని, పెనుబల్లి మండలం వీఎం బంజర, పెనుబల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతులకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజప్రభాకర్‌చౌదరి, తహసీల్దార్ గంటా ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో అన్నపూర్ణ, ఐకేపీ ఏపీఎం నాగు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. వేంసూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, మధిరలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ వీవో అధ్యక్షురాలు దర్శి శాంతి ప్రారంభించారు.

కూసుమంచి శివాలయంలో భక్తులు

పెనుబల్లిలో..

రఘునాథపాలెంలో..

ఆలయాల్లో 'కార్తీక' శోభ

కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో మండలంలోని ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. మహిళలు వేకువ జాముననే ఆలయానికి చేరుకొని శంభోశంకరుడికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. పాండురంగాపురం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో ఖమ్మం అర్బన్ సివిల్ సప్లయిస్ డీటీ విజయ్‌బాబు దంపతులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ బాధ్యులు ఏర్పాట్లు చేశారు. కూసుమంచిలోని కాకతీయుల నాటి పురాతన శివాలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలోని ఉసిరి, రావిచెట్ల కింద దీపాలు వెలిగించారు. కాగా, కూసుమంచి శివాలయంలో ఈ నెల 15న జరిగే కార్తీక పౌర్ణమి పూజలకు హాజరుకావాలంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆలయ కమిటీ బాధ్యులు ఆహ్వానాన్ని అందించారు. అలాగే, కల్లూరు పట్టణంలోని వీరభద్రుని ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రుపాలెం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో 20 జంటలు పాల్గొన్నాయి.

-నమస్తే నెట్‌వర్క్

ఎర్రుపాలెం: వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

వైరా టౌన్: శివాలయంలో..

'పాటిబండ్ల' కుటుంబానికి 'నామా' పరామర్శ

ఖమ్మం, నవంబర్ 4: ఖమ్మంలోని బ్యాంక్ కాలనీకి చెందిన ప్రముఖ వైద్యుడు పాటిబండ్ల సుదర్శన్ మాతృమూర్తి పాటిబండ్ల రాణి ప్రమీల ఆదివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం వారి నివాసానికి చేరుకుని రాణి ప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులైన సుదర్శన్, రత్నాకర్ తదితరులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్‌రావు, తన్నీరు రవి, పాటిబండ్ల ప్రసాద్, రాజేశ్, కృష్ణప్రసాద్‌పాల్గొన్నారు.

బీసీ కమిషన్ అభిప్రాయ సేకరణ వాయిదా

మామిళ్లగూడెం, నవంబర్ 4: ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించనున్న బీసీ కమిషన్ బహిరంగ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరోసారి అభిప్రాయ సేకరణకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిన తరువాత ఆ విషయాన్ని తెలియజేస్తామని అన్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

నాటక సమాజాల సమాఖ్య జిల్లా కమిటీ ఎన్నిక

రఘునాథపాలెం, నవంబర్ 4: రాష్ట్ర తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అనుబంధంగా ఉన్న ఖమ్మం జిల్లా సమాఖ్య ఎన్నికలు ఖమ్మంలోని బాలభవన్‌లో సోమవారం జరిగాయి. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్బరాజు, కొండపల్లి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జిల్లా సమాఖ్య అధ్యక్షుడిగా ముల్లంగి గాబ్రియాల్, ప్రధాన కార్యదర్శిగా వనం అప్పాజీ, ఉపాధ్యక్షులుగా బొడ్డు బొందయ్య, కోశాధికారిగా ఖాదర్‌బాబులను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా గుడిమెట్ల రామారావు, గౌరవ సలహాదారులుగా పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, తాటికొండల నర్సింహారావు, గౌరవ సలహాదారులుగా కంచి దయానంద భూషణ్, ముక్తి భాస్కర్‌రావు, హెచ్ఎల్‌పీ ప్రసాద్‌బాబు, ప్రచార కార్యదర్శిగా వై.రాజేశ్వరరావులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు టీ.కిశోర్‌రెడ్డి సహా మరికొంతమందిని ఎన్నుకున్నారు.

'రైతుల వివరాలను వెల్లడించాలి'

బోనకల్లు, నవంబర్ 4 : వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం పొందిన రైతుల వివరాలను వెల్లడించాలని ఏఐకేఎస్ మండల అధ్యక్షుడు ఏలూరి పూర్ణచంద్రరావు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన పంటనష్టపరిహారంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భూమి లేనివారికి, పంట సాగు చేయనివారికి సైతం డబ్బులు అందాయన్నారు. అర్హులకు మాత్రం సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి ఆనందరావు, కొంగర కృష్ణయ్య, పవన్ పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

బోనకల్లు, నవంబర్ 4 : బాల్‌బ్యాడ్మింటన్ ఖమ్మం ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్లను సోమవారం బోనకల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేశారు. ఈ పోటీల్లో మొత్తం 70మంది క్రీడాకారులు పాల్గొనగా వారికి పోటీలు నిర్వహించి అత్యంత ప్రతిభ కనబరిచిన 10మంది మహిళా, 10 మంది పురుష క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 8, 9, 10 తేదీల్లో వరంగల్‌లోని హన్మకొండలో గల జేఎన్ఎస్ కళాశాల గ్రౌండ్‌లో జరుగు 70వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో సెలక్షన్ అబ్జర్వర్ టీ.శేషగిరి, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అమరేషు లింగయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సత్తుపల్లి, నవంబర్ 4 : దివ్యాంగు